మనవాళ్ళు

నెలనెలా ఒక స్ఫూర్తి

# అసలైన ఆస్తి

ప్రశాంత ప్రకృతి... మంచు నిండిన పర్వతాలు... ఎక్కడో పైనుంచి మంచు కరిగి పర్వతాలపైనున్న బండరాళ్ళ నడుమ సన్నటి పాయగా వస్తున్న జలలు... తేరిపార చూస్తే పర్వతమే పరమ శివుడై వెన్నలా సున్నితంగా కనపడుతూ... అందులోనే కఠినత్వాన్ని ఆపాదిస్తూ పార్వతి అర్ధాంగిగా అంతర్భాగమై గోచరిస్తూ... ఆకాశం నుండి దూకిపడి జటాజూటంలో చెదిరిపోతున్న గంగా ప్రవాహంలాంటి జలపాతపు పాయలన్నీ కలిసి నదిలా ముందుకి సాగిపోతూంటే... ప్రకృతిలో చైతన్యానికి సజీవ సాక్ష్యమైన దర్శనం అందుతుంటే... ఏ కళ్ళు చెమర్చవు!? ఏ మనసు పులకించదు!!??



హిమాలయాల్లో గంగా ప్రవాహాన్ని చూస్తున్న ఎవరికైనా ఎంతో హాయి కలుగుతుంది. మనసునంటుకునే దృశ్యాలను అంతగా పట్టించుకోకపోతే కేవలం దృశ్యాలుగానే మిగిలిపోతాయి. కానీ అందులోనే అనిర్వచనీయమైన అనుభవాలను స్వంతం చేసుకుంటే అది దర్శనం అవుతుంది. అలాంటి దర్శనాలను అరుదుగా పొందే వ్యక్తుల్లో వాటిని అందరికీ పంచాలనే తలంపుతో ప్రయత్నం చేసేవారు ఇంకా అరుదుగా ఉంటారు. అలాంటి ఒకానొక భావుకురాలు చేసిన ప్రయత్నం ఒక వర్ణ చిత్రమయ్యింది. దార్శనిక చిత్ర వర్ణనే మనకు ఏవో లోకాలు ఆవిష్కరిస్తూంటే, చిత్రం చూస్తే ఇంకా ఎంతగా మైమరచిపోతామో!! అర్ధనారీశ్వర తత్వం అంటే ముక్కు, మొహం సరిగ్గ సగంలో కలిసుండడం కాదని, ఒకరిలో ఒకరు అంతర్భాగమై వెలుగొందడమని చూపే దర్శనం పొందిన వ్యక్తి ఏ యోగి పుంగవుడో కాక, మనలోనే సాధారణ జీవితాన్ని గడుపుతున్నవారిదని తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు.

తాము చెప్పదలచుకున్నది అంతా ఒక్కసారిగా చిత్రాల్లో వెలిబుచ్చుతూ ప్రేక్షకులను కట్టిపడేస్తారు చిత్రకారులు. తాము చెప్పదలచుకున్నది సంపూర్తిగా అందేలా పాఠకుణ్ణి చెయ్యిపట్టుకుని తమ ఆలోచనా పథంలో విహరింపజేస్తారు రచయితలు. భాషకందని అనుభవాలను చిత్రాల్లో చూపడం, జీవితంలో ఎదురయ్యే అనుభవాలను పదిమందికీ పంచే అక్షర చిత్రాలుగా మలచటం అనే రెండు ప్రజ్ఞలూ ఒకే వ్యక్తిలో ఒదగడం అద్భుతం. తన కుంచెలో అపారమైన భావ సౌందర్యాన్ని విష్కరిస్తూ, తన కలంతో అనుభవాలకు కొత్త దృష్టికోణాలద్దుతున్న వ్యక్తిత్వమే శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి గారు.

అక్షరాస్యత స్థాయికి మాత్రమే ప్రతీకలుగా నిలిచే డిగ్రీలేవీ చేయక, జీవితాన్ని చదువుతూ, మరింత శోభాయమానంగా తీర్చుకునే విజ్ఞాన సర్వస్వంగా తనను తాను మలచుకున్నారు సుబ్బలక్ష్మి గారు. భాగవతాది కావ్యాలు కంఠోపాఠం, షేక్స్పియరు ఇత్యాదుల ఆంగ్ల సాహిత్యం కరతలామలకం, రఘువంశాది సంస్కృత కావ్యాలు, వాటి భావార్థాలు నిత్యమూ నెమరువేసుకోవటం, ఇవన్నీ మించి తాను తెలుసుకున్న భావాలు అందంగా అమర్చి అందరికీ పంచటం ఇవన్నీ కలగల్సిన ఒక ముచ్చటైన బామ్మ గారే సుబ్బలక్ష్మి గారు. కథ-నవల రచయితగా, చిత్రకారిణిగా ఎంతో పరిణతి సాధించినప్పటికీ ఇంకా ఎంతో సాధించాలని ఉత్సాహంతో ఉవ్విళూరుతున్నది ఒక ఎనభై యేళ్ళావిడ అంటే విస్మయంతో కూడిన ఆనందం కలుగుతుంది.

సాధారణంగా భార్యా భర్తలిరువురూ ఒకే సృజనాత్మకా రంగంలో ప్రావీణ్యత సంపాదించడం, తమ తమ కళారంగాల్లో పేరుతెచ్చుకోవడం అరుదుగా గమనిస్తుంటాం. తాను రాసిన ఒకే ఒక్క నవల( చివరకు మిగిలేది) ని తెలుగు సాహితీ చరిత్రలో చిరంజీవిగా మలచిన ప్రఖ్యాత నవలా, నాటక, కథా, వ్యాస రచయిత, చిత్రకారుడు, స్వర్గీయ బుచ్చిబాబు (శివరాజు బుచ్చి వెంకట సుబ్బారావు) గారి సతీమణే శ్రీమతి సుబ్బలక్ష్మిగారు. ఈమె కూడా ప్రముఖ రచయిత్రి, చిత్రకారిణి కావడం విశేషం..

ప్రతి నెలా తెలుగువాళ్ళలో రతనాలు అనదగ్గవారిని పరిచయం చేసే ఈ యఙ్ఞంలో ఎప్పటిలానే ఈ మాసమూ ఒక విశిష్ట వ్యక్తిత్వం గూర్చి పాఠకులకు, ముఖ్యంగా నేటి యువతకు తెలియపఱచాలన్నదే సిలికానాంధ్ర సంకల్పం. మాట్లాడిన కొద్దిసేపటిలో "మన" అన్న భావన కలిగించి ఆత్మీయంగా తన అనుభవాలను పంచుకున్నారు మన బామ్మ గారు, సుబ్బలక్ష్మి గారు. అపారమైన జ్ఞాన సంపదతో నిండుగా ఉన్న ఆవిడ జీవితం నుండి స్ఫూర్తి పొందే ప్రయత్నమే ఈ నెల కథనం. ఆవిడ జీవితపు సంగతులు, విశేషాలు...

## చిన్ననాటి ముచ్చట్లు

అది భారత దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు సంగతి. స్వరాజ్య ఉద్యమాలు ఊపందుకున్న కాలం. తెలుగుభూమిలో కూడా వాడ వాడలా ఎంతో మంది పోరాటం చేస్తూ జైళ్ళపాలవుతున్న కాలం. రాజమండ్రి దగ్గర ఇప్పన్నపాడు గ్రామంలో, గ్రామ కరణం గారింట్లో కోలాహలంగా ఉంది. కొంత మంది హడావిడిగా వచ్చి పోలీసుల బారి నుండి తమను దాచి, ఉద్యమం విజయవంతమయ్యేందుకు తోడ్పడమని అడిగితే కరణం గారు తన ఇంట్లో దాగి ఉండమని వారికి చెప్పారు. కరణం గారి పదేళ్ళ కూతురు, సుబ్బులు ఇదంతా గమనిస్తూనే ఉంది. కొద్ది సేపట్లో పోలీసులు వచ్చి ఇల్లు సోదా చేయటానికి రానే వచ్చారు. ఇంట్లో ఎవరన్నా దాగి ఉన్నారా అని అడగటం, కరణాం గారు లేదని చెప్పటం జరిగింది. "సత్యం వద - ధర్మం చర" అన్న మాటలు వంట



పట్టించుకున్న  చిన్నారి సుబ్బులు మాత్రం నిజం చెప్పేయాలని ముందుకు వచ్చింది. సుద్దులు నేర్పిన నాన్నగారే అబద్ధం చెప్పారంటే ఏం చేయాలా అని క్షణం ఆలోచించింది. అంతలోనే తన చిన్నారికి సైగ చేశారు "వద్దు అమ్మలూ" అని ఎప్పుడూ ప్రేమగా చెప్పే విధంగా. పోలీసులు వెళ్ళిపోగానే ఉండబట్టలేక అడిగేసింది తండ్రిని "అబద్ధం చెప్పారేమిటి నాన్నా?" అని. ఆయన మురిసిపోతూ "దొంగలో,లేదంటే తప్పు చేసిన వారో అయితే నువ్వు నేర్పిన మాట వర్తిస్తుంది. వీళ్ళు దొంగలు కాదు, మనకు స్వాతంత్ర్యం తెచ్చే సేనా నాయకులమ్మలూ. నువ్వు నేర్చుకున్నది మంచి విషయం. అయితే దానిని సరిగ్గా ఆచరించాలి..." అంటూ చెప్పుకుపోతుంటే నేర్చుకున్న విజ్ఞానాన్ని వివేకంతో అమలులో పెట్టటం బోధపడింది.

సంఘ సేవలో, స్వరాజ్యోద్యమంలో జీవితాన్ని వెచ్చించిన ద్రోణంరాజు సూర్యప్రకాశరావు గారు, సత్యవతి గార్లకు 1925 సెప్టెంబరు 17న రాజమండ్రిలో ఇన్నిస్పేటలో జన్మించారు సుబ్బలక్ష్మి గారు. ముగ్గురన్నదమ్ములు, ముగ్గురప్పచెళ్ళెల్లలో రెండవ కుమార్తె ఆవిడ. తండ్రి గారు ఆ రోజుల్లోనే బీ.ఏ చదివారు. ఆ రోజుల్లో పెద్ద ఉద్యోగం చేసే చదువే అయినా ఆయన సహాయనిరాకరణ ఉద్యమంలో చేరి, సంఘ సేవ చేస్తుండేవారు. ఇప్పనపాడు అనే గ్రామంలో కరణీకం చేస్తూ  గ్రామాన్ని వృద్ధిలోకి తీసుకువచ్చారు. ఆయన అనేక పాఠశాలలు స్థాపించి, అన్నికులాల వారిని చేర్పించి చదువు చెప్పేవారు. చిన్నతనంలో ఐదేళ్ళ వయసులో రాత్రి పూట ఊళ్ళో చదువురాని వారిని ప్రోగేసి ఇంట్లో అరుగుల మీద కూర్చోబెట్టి రాత్రి బడి నిర్వహించడాం లాంటివి చూస్తూ సుబ్బలక్ష్మి గారు చదువు విలువ తెలుసుకున్నారు.

తండ్రి వద్దే ఇంగ్లీషు చదువు, ఖగోళ శాస్త్ర విషయాలు, బడిలో తెలుగు, ఇంట్లో ప్రత్యేకంగా గురువు వద్ద సంస్కృతమూ నేర్పడంతో బహు భాషల్లో చిన్నతనంలోనే మంచి పట్టు ఏర్పడింది సుబ్బలక్ష్మి గారికి. పినతండ్రిగారి ప్రోత్సాహంతో ఆంధ్రపత్రిక చదువుతూ ఏ రోజుకారోజు వార్తా సంగ్రహం ఆయనకి అందించడంతో అందులోని వ్యాసాల వల్ల రచనల పట్ల, ఆసక్తి అవగహన కొద్దికొద్దిగా ఏర్పడింది. ఎలా  వ్రాస్తే పదిమందికీ భావాన్ని పంచవచ్చో తెలిసింది. ఏనాటికైనా రచయితలను సృష్టించేది పత్రికలే అనడానికి ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి? విజ్ఞాన సముపార్జనే కాక ఇంట్లో చిన్నతనంలో ముగ్గులు వేయడంలో అభిరుచి కనబరుస్తూండేవారు. రకరకాల ముగ్గులు మొదట నేర్చుకుని అందరికన్నా త్వరగా వేసేవారు. ఆ రోజుల్లో పోటీగా కొత్త ముగ్గులు సృష్టించి మరీ వేస్తూండేవారు. రకరకాల లతల ఆకృతులలో ముగ్గులు వేయడం తరువాతి

కాలంలో చిత్రకళ వృద్ధిచెందడానికి ఎంతో ఉపకరించడం చూస్తే, మన సంప్రదాయాల్లో మనిషి అన్ని రంగాల్లోనూ ఎదగాడానికి ఊతమిచ్చే ఇన్ని వసతులున్నాయని అవగతమవుతుంది.

సాంప్రదాయాలు ఎంతగానో పాటించే తమ బ్రాహ్మణ కుటుంబంలో కులాల విచక్షణ లేకుండా సహపంక్తి భోజనం ఏర్పాటుచేసేవారని చెబుతుంటే వివేకమున్న చోట ఆచారాలు, సంప్రదాయాలు సరైన స్ఫూర్తితో ఆచరింపబడతాయని విదితమౌతుంది. ఆ నాటి జీవనం గురించి చెబుతూ, "మా చిన్నతనంలో మా ఊరు అంతా కమ్మ వారు ఉంటూండేవారు. ఈ రోజుల్లో అయితే కులం చిచ్చు వచ్చింది కానీ రోజుల్లో అసలు కులాలు విడదీయటానికి కాక ఆచార సంప్రదాయాలు నిర్దేశించేవి మాత్రమే అయ్యేవి. అందుకే మా ఊళ్ళో అందరమూ కులాలు వేరైనా తాత, మామ అనుకుంటూ అందరితో తిరిగేవాళ్ళం. అందరూ అంత ఆప్యాయంగా ఉండేవాళ్ళు కూడాను. ఎక్కడినుంచి వచ్చిన చిచ్చో నేడు ప్రాణాలు తీస్తోంది" అంటూ ఆవేదనగా చెబుతుంటే, మనం ఆధునికులం అవుతున్న కొద్దీ అనాగరికులం అవుతున్నామేమో అన్న భావన కల్గుతుంది.



ఆరవ తరగతి వరకు స్వంత ఊరులో పాఠశాల చదువు అయ్యాక, ఆపై మండపేట హైస్కూలుకి వెళ్ళాల్సి రావడం, అది మగపిల్లల బడి అవడంతో చదువు ఇంటిలోనే కొనసాగింది. మెట్రిక్యులేషను పరీక్ష కూడా ప్రైవేటుగానే ఇచ్చేరు. పొలలన్నా, కాలవ గట్ల వెంబడి తిరుగుతూ ప్రకృతి అందంలో ఓలలాడడమన్నా ఎంతో సరదా అంటూ, పొలాల్లో ఉండే దూడలు, పక్షులు వీటన్నింటిని అనుకరిస్తూ గడిపిన రోజులు అవన్నీ ఈనాటికీ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయని ఆ విశేషాలు చెబుతుంటే ముచ్చటేస్తుంది.

## "టీనేజి" గృహిణి...

ధర్మ శాస్త్రాల్లో చెప్పిన నియమాలనుపాటించే కుటుంబమవడంతో పన్నెండేళ్ళకల్లా వివాహం చేయాలని నిశ్చయించారు తండ్రి. ఒకనాడు ఒక యువకుడు తన అన్నతో కలిసి పెళ్ళిచూపులకని వచ్చేరు. బీ.ఏ. చదువుతూ పదిమందిలోనూ యోగ్యుడని కితాబులందుకున్న ఆ యువకుడితో వివాహం నిశ్చయమవటం, పెళ్ళి అవటం అంతా ఒక వారంలోనే చకచకా జరిగిపోయాయి. ఊరంతా కలిసి సుబ్బలక్ష్మి గారి పెళ్ళి పండుగ చేశారు.

భర్త బీ.ఏ. చదువు పూర్తయే వరకు కాపురానికి వెళ్ళకపోయినా అప్పుడప్పుడు వచ్చే జాబుల్లో ఏదో పత్రికలో తను వ్రాసిన కథ పడిందని వ్రాస్తే అవి చదువుతూ ఆలోచించటం నేర్చుకున్నానంటారావిడ. జాబుల్లోనే ఏమేమి

చదవాలో ఎలా చదవాలో తెలియజెప్పుతూ కొత్త ఆలోచనా సరళిని అలవర్చారు, భర్త, శ్రీ శివరాజు బుచ్చి వెంకట సుబ్బారావు. ఆయనే తరువాతి కాలంలో రచయితగా ప్రఖ్యాతి పొందిన 'బుచ్చిబాబు' గారు.



బుచ్చి బాబు గారు ఎం.ఏ. చదవటానికి మద్రాస్ వెళ్ళారు. ఇక అప్పుడు సుబ్బలక్ష్మి గారిని కాపరానికి పంపటంతో కొత్త జీవితం ప్రారంభమయ్యింది. తనకంటే సుమారు తొమ్మిదేళ్ళు పెద్ద వ్యక్తి, ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూ, ఆలోచిస్తూండటం అబ్బురపఱచింది. అంతవరకూ ఏవో కథల్లాంటివే చదివిన ఆవిడకు అంతగా ఆలోచించేదేముంటుందో అర్థం కాలేదు. అదే బుచ్చిబాబు గారిని అడిగితే తను చదివే పుస్తకాల్లో విషయాలను వివరిస్తూ ఆవిడనూ చదవమని ప్రోత్సహించేరు. మొదట అంతగా ఆసక్తి కలగకపోయినా బుచ్చిబాబు గారి వివరణలు నచ్చి, ఇంకా తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగి, చదవటం నెమ్మదిగామొదలుపెట్టి ఇక తానూ విశ్లేషణాత్మకంగా ఆలోచించసాగారు సుబ్బలక్ష్మి గారు. ఎటువంటి పరిధులూ విధించుకోక ఎన్నో శాస్త్రీయ విషయాలు, సిద్ధాంతాలు ఆమూలాగ్రం చదవటం అలవాటయ్యింది. బుచ్చిబాబు గారు విషయాలను సూక్ష్మీకరిస్తూండడం విజ్ఞానాన్ని పెంపొందించేది.

ఇక సాధారణ గృహిణిగా బాధ్యతలున్నా ఓ వైపు భర్త రచనలపైన, చదవటంపైన మనసు పోతూండేదని చెబుతుంటె మహాపురుషుల సాంగత్య మహాత్మ్యం అవగతమౌతుంది. రచయితగా తాను ఎంతో పరిణతి పొందుతూ తన భార్య కూడా ఎంతో విజ్ఞానం సంపాదించాలని తపించే భర్త దొరకటం తనకు భగవంతుడిచ్చిన వరం అంటారు సుబ్బలక్ష్మి గారు.

మద్రాసులో ఉండే రోజుల్లోనే బుచ్చిబాబు గారు చిత్రాలు వేయడం మొదలుపెట్టారు. భర్తను ఇట్టే అనుసరించే ఆవిడా బొమ్మలు వేయడం మొదలుపెట్టారు. తన ప్రతీ కళకూ మూల స్ఫూర్తి తన భర్తేనని గర్వంగా చెబుతానంటారావిడ. మొదట్లో కేవలం దృశ్యాలే చిత్రిస్తూ నెమ్మదిగా భావపరిపుష్టమైన చిత్రాలు వేయడం జరిగింది.

**రచయిత్రిగా అవతరణ...**

ఇక భర్త ఉద్యోగ రీత్యా వైజాగ్ లో, అనంతపురంలో, కొంత కాలం ఉండి విజయవాడ వచ్చి స్థిరపడ్డారు.

కళలకు కేంద్రమైన ఆ ప్రదేశంలో ఆకాశవాణిలో బుచ్చిబాబు గారికి ఉద్యోగం రావడంతో ఇక కళాకారులకు నెలవులా మారింది ఇల్లు. ప్రతీ నిత్యం ఆకాశవాణి కేంద్రానికి విచ్చేసే పలు రచయితలు గాయకులు, కవులు మున్నగువారిని ఇంటికి తీసుకు వస్తూండటంతో మహానుభావుల పరిచయం ఏర్పడింది సుబ్బలక్ష్మి గారికి. ఇక ఇంట్లోనే ప్రతి నిత్యం ఓ కవి సమ్మేళనం, చర్చా కార్యక్రమాలు సాగుతుండేవి.



అక్కడే బుచ్చి బాబు గారి ప్రోత్సాహంతో ఓ సంస్కృత అధ్యాపకుల వద్ద సంస్కృతాధ్యయనం మొదలుపెట్టారు. డిగ్రీల కోసం కాక కావ్య పఠనకై చదువు మొదలెట్టానని ఆవిడ చెబుతుంటే చదువు అసలు ఎందుకు అన్నది స్పష్టమవుతుంది. అలా చదివిన కావ్యాల ఆధారంగా క్రొత్త విశ్లేషణలు చేయడం అలవోకగా ప్రారంభమయ్యింది ఆవిడకు.

బుచ్చి బాబు గారు విరివిగా కథలు వ్రాస్తూ జనబాహుళ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్న ఆ రోజుల్లో ప్రతీ కథకు తానే మొదటి పాఠకురాలు, విమర్శకురాలు అయ్యారు సుబ్బలక్ష్మి గారు. మధ్యతరగతి స్త్రీలను బ్రతికించిన బుచ్చిబాబుగారి కథలకు ఆర్ద్రమై, కథలను సుఖాంతం చేయమని అడుగుతుండేవారావిడ. అనుభవాలకు స్పందించే సున్నితమనస్కులవటంతో తానే కథ వ్రాయడం మొదలుపెట్టారు. పండిత సాంగత్యంలో కొంత మంది "మఱ్ఱి చెట్టు నీడన చెట్టు"లా ఎదుగలేకపోతుంటారు. ఆ సామెతను వమ్ము చేస్తూ తనదంటూ ఒక శైలిని ఏర్పఱచుకుని, అందరూ మెచ్చేలా కథా రచన ప్రారంభించారు. కథలకు కొత్త ముగింపునిస్తూ సుఖాంతం చేస్తూ పాఠకులకు సమస్యను చూపడమే కాక పరిష్కారమూ చూపించేఱు. అలా వ్రాసిన కథల్లో మొదటగా అచ్చయింది "కాపురం". ఇక అక్కడి నుండి ఎన్నో వ్రాసినా, ఏనాడు కథ వ్రాయాలని, ఏదో అచ్చు వేయాలని కాక ఒక గొప్ప భావానికి అక్షర రూపమివ్వలని అనుకున్నపుడే కథ వ్రాసేవారు. ఆ పై నవలలు వ్రాయడం మరో మెట్టు. తన అనుభవంలోనివే కాక అన్ని వర్గాల వారి జీవితాలను చూపెడుతూ రచన చేయడం ఆవిడ పరిణతికి నిదర్శనం.

## 'చిత్ర' విన్యాసం...

బుచ్చిబాబు గారిని అనునిత్యమూ అనుసరించి, ఆయనతోపాటు చిత్రాలు గీయడము, మంచి రంగులద్దడము అలవోకగా నేర్చుకున్నారు. బుచ్చిబాబుగారు పెన్సిలుతో గీచిన బొమ్మలు రంగులు వేయక వదిలేస్తే, పారవేయలేక రంగులేయడం మొదలుపెట్టానని చెబుతుంటే ఆయన ఆవిడకు ఎంతగా తనపై 'ఏదైన చేయగలన'న్న విశ్వాసం నింపారో అర్థమవుతుంది. ఏనాడు ఏ గురువు వద్దా ప్రత్యేకంగా శిక్షణ చేసింది లేకపోయినా చిత్రాలు చూస్తూ, గీస్తూ, రంగులద్దుతూ విశేష ప్రతిభ సంపాదించారు. ఏ ప్రదేశానికి వెళ్ళినా చిత్రాలో, రచనలో, ఏ భావం ఏ కళా

రూపంలో చక్కగ ఒదుగుతుందో ఆ కళ మాధ్యమంగా భావాలను ప్రస్ఫుటంగా అందరికీ చూపించారు. పెళ్ళైన కొత్తలో ఓ సారి వైజాగ్ సముద్రపు ఒడ్డున కూర్చుని భార్యా భర్తలిద్దరూ సముద్రాన్ని గీస్తే, కృష్ణమూర్తి గారనే ఒక గొప్ప ఆర్టిస్టు ఆవిడ బొమ్మలోని "క్యూబిజం" బాగ కనపడుతోంది అని ఇంకా బాగా చేయమని ప్రోత్సహించారు. ఇంకా ఎంతో మంది మహానుభావుల చిత్రాలను చూస్తూ లోతుపాతులు అర్థం చేసుకుంటూ తన ప్రతిభకు పదును పెట్టుకున్నారు సుబ్బలక్ష్మి గారు. అలా పరిణతి చెందుతూ నైరూప్య (ఆబ్స్ట్రాక్ట్) చిత్రాల్లో ఎంతో ఆసక్తితో చిత్రాలు వేస్తూ విమర్శకులెంతో మందిచే ప్రశంసలందుకున్నారు.

ప్రకృతిని ఎంతో ప్రేమించే హృదయం అవడంతో ఏ ప్రదేశానికి వెళ్ళినా ముందుగా ఆ దృశ్యాల్లో తత్వ దర్శనం చేసుకుంటూ, తన భావాలను ప్రతిబింబించే చిత్రాలు కొన్ని వందలు వేశారు సుబ్బలక్ష్మి గారు. తాను గీచిన చిత్రాల్లో చాలా వరకు ఎంతో మందికి ఇచ్చివేశానని, ఎక్కడున్నాయో తెలియదని చెబుతుంటే, కళయొక్క పరమావధి తెలుపుతుంది. మనకొరకు మాత్రమే కాక, అందరికీ మన దర్శనాలను పంచటమే కళయొక్క లక్ష్యమని తేటతెల్లమవుతుంది. ఆకాశమంటే తనకు ఎంటో ఇష్టమని చెబుతూ తన అన్ని రకాల చిత్రాల్లోను ఆకాశం చిత్రించినవి చూసిన ప్రతిసారీ కొత్త సందేశమిచ్చేవి అంటారావిడ. ఆకాశమంత విశాలత్వాన్ని పెంపొందించుకోవాలన్న తపన ఉండటమే కారణమేమో!

## అసలైన బంగారం...

ఓ నాడు టీ.ఎస్. ఇలియట్ సాహిత్యం సెట్టు అంతా కొత్తగా బజారులోకి వచ్చింది. స్వత హాగా ఏ కొత్త పుస్తకాన్నయిన కొని చదివే మంచి అలవాటున్న బుచ్చిబాబుగారు ఆ పుస్తకాలను వదల్లేకపోయేరు. కొందామని చూడబోతే తన వద్ద 100 రూపాయలకన్నా లేకపోవడంతో దిగులుగా ఇంటి ముఖం పట్టారు. మాటల మధ్య దిగులుకు కారణం తెలుసుకున్న సుబ్బలక్ష్మి గారు, ఆ తరువాత రోజే, తెలిసిన ఒక బంగారం కొట్టుకి వెళ్ళి, తన వద్దనున్న నగలు అమ్మి, పుస్తకాలు కొని తీసుకువచ్చారు.

బుచ్చిబాబు గారు చదవనిది అంటూ ఏమీ లేదని చెప్పవచ్చును. కనపడిన ప్రతీ పుస్తకంలోనూ ఉన్న జ్ఞానాన్నంతా ఆస్వాదించాలని ఆయన చేసే ప్రయత్నంలో ఉన్న డబ్బంతా పుస్తకాలకే ఖర్చయ్యేది. చక్కగా ప్రభుత్వోద్యోగంలో సంపాదించే భర్త ఉండగా, బంగారం కొనడం మాత్రమే ఎంతో మందికి తెలుసు. కానీ పై మెరుగుల బంగారాన్ని అసలైన వన్నెనిచ్చే బంగారంలోకి మార్చిన ఆవిడ ఈనాటి తరాల ఆడవాళ్ళకి వింతగా కనపడవచ్చు. కానీ ఏనాటికీ తరగిపోని ఆస్థి కూడబెట్టుకుని ఎల్లకాలానికి ఆదర్శప్రాయమై నిలిచి ఉంటారని వేరే చెప్పాలా?

**రచనలు...**

తెలుగులోని అనేక వార, మాస, పక్ష పత్రికలలో సుబ్బలక్ష్మి గారివి ఎన్నో కథలు ప్రచురింపబడ్డాయి. దశాబ్దాలుగా అనేక అనుభవాలను, సమస్యలను క్రోడీకరిస్తూ ఆవిడ డెబ్భైకి పైగా కథలు వ్రాశారు. ఆవిడ కథల సంపుటాలు మూడు వచ్చాయి. ఈ మధ్యనే అన్ని సంపుటాలనూ కలిపి ఒకే సంకలనంగా ప్రచురించారు. తన జీవితంలో జరిగిన అనేక సున్నితమైన విషయాలను తెలియజెప్పుతూ మూడు నవలలు "నీలంగేటు అయ్యగారు", "తీర్పు", "అదృష్ట రేఖ" వ్రాశారు. "తరుణ" అనే పత్రికలో వచ్చిన "తీర్పు" తనకు నచ్చిన తన నవల అంటారు. తన కథల్లో అంతా తనదైన ముద్ర వేసి, తనదైన శిల్పాన్ని ఆవిష్కరించడంలో సఫలీకృతులయ్యారు సుబ్బలక్ష్మి గారు. తన భావాల్లో బుచ్చిబాబు గారి ప్రభావం ఎంత ఉందో రచనల్లో, శిల్పంలో ఆయనను అనుకరించకుండా ప్రత్యేకత నిలబెట్టుకోవడం వల్లనే చిరకాలం నిలిచి ఉండే రచనలు చేశారు.

ఆవిడ రచనలు ఒక గొప్ప తాత్విక విషయాన్నో లేక నిజ జీవితంలో జరిగే సంఘటనలనో ఆధారం చేసుకుని జాగ్రత్తగా చెక్కారు.

తన కథలకు కల్గిన గుర్తింపును చెప్పమని అడిగితే రుక్మిణీ నాథ శాస్త్రి గారు ఓ సందర్భంలో తనకు బుచ్చిబాబు గారి కథ కన్నా సుబ్బలక్ష్మి గారికథే నచ్చిండనటం, వడ్డెర చండీదాస్ గారు, "నాకు ఆవిడ కథలకు, బుచ్చిబాబు గారి కథలకు తేడా కనిపించట్లేదని ఓ సందర్భంగా వ్రాయడం నాకు లభించిన గొప్ప సత్కారాలు." అని చెప్పడం, ఆవిడ దృష్టిలో అసలైన సత్కారం అంటే ఏమిటో తెలియపరుస్తుంది.

**కథలు ఎలా ఉండాలి...**

కథ నడిపించవల్సిన శైలి, తీరు వివరిస్తూ,"కథకు ఆయువు పట్టు ముగింపు. కథలో ప్రతీ వాక్యంలో వర్ణన అక్కరలేదు. స్థూలంగా ఒక చిత్తరువు కనిపించాలి. కథ వ్రాస్తే అక్కడికి ముగిసినట్లనిపించాలి. ఇంకా అక్కడి నుండి పొడిగించగలిగితే అది అసంపూర్ణమే."

కథల్లో కొత్త పోకడలతో కుటుంబాలు విచ్ఛిన్నమయ్యేలా వచ్చే కథలను నిరసిస్తూ, తనగూర్చి "ఏదో సంసారపక్షంగా కథలు వ్రాస్తార"ని ఆధునికులమని అనుకునేవారు ఈసడింపుగా మాట్లాడినా, కుటుంబాలని కలిపే కథలే వ్రాసే ప్రయత్నం చేశారు. తన కథల గుర్చి చెబుతూ "కథలు వ్రాస్తే కుటుంబాలు కలిసి ఉండేందుకే! కథ వల్ల సంసారం విచ్ఛిన్నం కాకుండా ఉండాలి. పిల్లలకోసమన్నా కట్టుబడి ఉండాలి అన్నదే నా

సిద్ధాంతం. ప్రేమతో అవతలవాళ్ళని మార్చుకోవాలి కానీ విడిపోవడమన్నది నాకు మనస్కరించదు." అంటూంటే సాహిత్యం విపరీత ధోరణులకు పోకుండా పట్టి ఉంచే ఇలాంటి వారు ఉండాలని అనిపిస్తుంది.

### మాతృప్రేమ...

బుచ్చి బాబుగారు ఉండగా ఇల్లంతా పండితులతో కళకళలాడుతు ఉండేది. కృష్ణశాస్త్రి గారు, శివ శంకర స్వామి, చండీదాస్, శశాంక్, ఇత్యాది అనేక మంది కలిసి చేసే చర్చలతో ఇల్లంతా కోలాహలంగా ఉంటూండేది. వాడి, వేడి చర్చల్లో పంటి కిందకి పకోడీలు, కాఫీ క్షణాల్లో తయారు. "వారింట్లో తిననివారెవరు" అని అందరూ అనుకునేవారని వింటుంటే సుబ్బలక్ష్మిగారు గృహిణిగా ఏమాత్రమూ లోటులేకుండా తమను తీర్చిదిద్దుకున్నారని విశదమవుతుంది. ఉద్యోగం ఒక్కటి చేసి వచ్చి ఉసూరుమంటూ చతికిలపడే నేటి తరం ఆడవాళ్ళు, మగవాళ్ళు ఆవిడ జీవితం నుండి నేర్చుకోవల్సినది ఎంతైన ఉంది. ఆవిడ మాటల్లో... "అందరి బాగోగులు చూడగలిగినదే స్త్రీ. అలాంటపుడే మాతృమూర్తిగా భాసిల్లుతుంది. అలా కానప్పుడు అసలా వ్యక్తి స్త్రీయే కాదని నా భావన. మన సంప్రదాయంలో స్వతంత్ర్యం చాలా ఇచ్చారు. ఐతే స్వాతంత్ర్యం అన్న పదానికి సరైన అర్థం తెలియనివారు లేదంటున్నారు. వంటింటికే పరిమితమవమని మన సంప్రదాయం శాసించలేదు. అసలు వంటిల్లు అంటే అన్ని బాగోగులు చూసే ప్రదేశం, అంటే స్త్రీని మాతృమూర్తిగా నిలబెట్టే చోటు."

### వియోగం..



1967 వ సంవత్సరం సెప్టెంబరు 20 వ తారీఖు. హైదరాబాదులో ఒక ఆసుపత్రి గదిలో అంతా నిశ్శబ్దంగా ఉంది. అనారోగ్యంతో చిక్కినా, ఆర్జించిన జ్ఞానపు వెలుగులీనుతోంది మంచంపై పడుకున్న వ్యక్తి ముఖం. పక్కనే నిశ్శబ్దంగా కూర్చుని మనసు పరి పరి విధాల పోతుంటే చిక్కబట్టుకుని కూర్చుంది ఆయన గృహిణి. ఒక్క సారి కళ్ళు తెరిచి చూస్తూ "నువ్వు చేసినది ఒక్క పెసరట్టు, కాఫీ కావాలి" అని అడిగారు. ఏమీ జీర్ణించుకోలేని ఆయన చిన్న కోరిక ఎలా తీర్చాలా అని మధనపడుతుంటే వెంటనే వచ్చింది మరో ప్రశ్న, "నన్నెలా బ్రతికిస్తావు?"

ఆ ప్రశ్నకు కళ్ళు చెమ్మగిల్లాయి ఆ గృహిణికి. మహా విజ్ఞాని, భావకుడు, బుచ్చిబాబు గారు అదేరోజు భౌతికంగా ప్రపంచాన్ని వీడినా సుబ్బలక్ష్మిగారికి ఆయన్ని బ్రతికించగలిగే ఒక్క మార్గమే కనబడింది. ఆయన రచనలను చిత్రాలను భద్రపరచి భావితరాలకు అందివ్వడమే లక్ష్యంగా ఏర్పరచుకున్నారు.

ఆనాటి నుండి ఆయన సాంగత్యంలో తెలుసుకున్న ఆదర్శాలను చరణలో పెడుతూ జీవనాన్ని సాగించడమే జీవితానికి పరమావధి అయ్యింది. అందుకనే హైదరాబాదులో తానున్న చోట ఒక మహిళా సమాజాన్ని 1970 నుండి 1984 వరకు మిత్రులతో నిర్వహించారు.

## మరచిపోలేని జ్ఞాపకాలు...

తన జ్ఞాపకాలు ఆవిడ మాటల్లోనే:
"క్షేత్రాలు తిరుగుతూ ఓసారి రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళినపుడు అనుకోకుండా చలం గారిని చూడడం జరిగింది. అంతకు ముందు ఆయనతో ఉన్న పరిచయం వల్ల ఆయన్ని చూశాక ఆయనలోని మార్పు స్పష్టంగా గోచరించింది. ప్రశాంతంగా ఉన్న ఆయన్ని చూస్తే చెప్పలేని అనుభూతి కల్గింది. మాటల్లో ఆయన్ని, 'అంతకు ముందు వ్రాసిన రచనలపై అప్పుడేమనుకుంటున్నార'ని అడిగా. 'ఆ చలం కాదు ఈ చలం'అన్న మాట విన్నాక గిరున నీళ్ళు తిరిగాయి. మనుషుల్లో అంత పూర్ణత్వం సాధ్యం అన్నది అప్పుడు అవగతమయ్యింది.

మద్రాసులో ఉండగా గాంధీ గారు ఒక నలభై రోజులు బస చేశారు. ఆ కాలంలో ఆయన ఉపన్యాసాలకు ప్రతిరోజూ వెళుతూ దివ్యమైన తేజస్సుతో వెలిగిపోయే ఆ మూర్తిని దర్శించాక పునీతమైన భావన కలిగేది. ఈ మధ్య ఆయన్నీ విమర్శిస్తున్నారని తెలిసి హృదయంలో ముల్లులా గుచ్చుకుంటొంది. ఆయన్ని చూసినవారికే తెలుస్తుంది ఆయనలోని గొప్పతనం."

ఇంకా పెళ్ళైన కొత్తలో మా వారు నన్ను మొదటగ సామర్లకోటకు తీసుకుని వెళ్ళి రబీంద్రనాథ్ టాగూరు గారితో సంభాషింపజేయడం; మా పెదమామగారు నాచే సుభాస్ చంద్రబోస్ గారికి వీర మాల వేయించడం ఎప్పటికీ మరచిపోలేని స్మృతులు.

## కుటుంబం...



తన తమ్ముడి పుత్రుడు, శ్రీ సుబ్బారావు సంరక్షణలో ప్రస్తుతం బెంగుళూరులో ఉంటున్నారు. సుబ్బారావు గారు, ఆయన భార్య సోనా, కొడుకు సిద్ధార్ధ్ ప్రస్తుతం ఆవిడ లోకం.

## లక్ష్యం...

భావుకత నిండిన బుచ్చిబాబు గారి చిత్రాలను ఒక సంగ్రహంగా పదిలపరచాలన్నదే తన తాపత్రయమని ఇంకా ఈ వయసులోనూ ఓపికున్నంతవరకూ సాధ్యమైనంత చేస్తానని ధీమాగ చెబుతుంటే ఉత్సాహంగా ఆశయసాధనకి ముందుకెళ్ళడానికి వయసు అడ్డులేదని అనిపిస్తుంది. ఆవిడ లక్ష్య సాధనకు మనమూ ఓ చేయివేసి బుచ్చిబాబుగారిని చిరస్మరణీయులుగ చరిత్రలో నిలుపుదాం.

ఏదన్నా ఒక గొప్ప విషయాన్ని తెలుసుకున్నపుడు మనమూ ఎంతో స్ఫూర్తి పొందుతాం. కానీ మరల సాధారణ పనిపాట్లలో పడగానే మనం మళ్ళీ ఆ స్ఫూర్తిని జాగ్రత్తగా అటకెక్కిస్తాం. కానీ ఒక లక్ష్యం, ధ్యేయం నిర్దేశించుకుని ముందుకు సాగిన నాడు మనం పొందిన స్ఫూర్తి సార్థకమౌతుంది. లేకుంటే ఆరంభ శూరత్వమౌతుంది. మన ధ్యేయాలు బలంగా నాటుకోవాలంటే తపన ఉండాలి, నిరంతర పరిశ్రమ ఉండాలి. అవి మనకూ అబ్బాలంటే కనీసం అలాంటివారి జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. సుబ్బలక్ష్మి గారి అనుభవాలు సాగరమంత. 'కడవ కొద్దీ నీళ్ళు' అన్న సామెతలాగా మన పాత్రకు తగ్గట్లుగానే మన ప్రయత్నానుసారంగా మనకూ మన వాటా దొరుకుతుంది.

ఈ వ్యాసం ఆరంభంలో వర్ణించిన తైల వర్ణ చిత్రం చూద్దామనుకుంటే ఆ అదృష్టం ఉందో లేదో కూడా తెలియని పరిస్థితిలో మనం ఉన్నాం అంటే నమ్మగలరా? కాలగతిలో మరుగునపడి ఏ అదృష్టవంతుడి దగ్గరకో చేరింది ఆ చిత్రం. మ్యూజియంలకు అమ్మాలనో లేక పెద్ద పేరు తెచ్చుకోవాలనో ప్రతిఫలాపేక్ష లేక కేవలం నిర్మల చిత్తంతో తమ దర్శనాన్ని పక్కవాళ్ళకి పంచాలన్న తపనతో ఇచ్చివేయడం, అందులోనే "ఆత్మతృప్తి" పొందటం ఆవిడ ప్రత్యేకత.

భారత సంప్రదాయం పునాదిగా ఆధునిక భావాలను కలగలుపుకుంటూ నిర్మించుకున్న వ్యక్తిత్వం సుబ్బలక్ష్మిగారు. ఆవిడ జీవనయానం అతి సాధారణంగానే అనిపించినా, అనన్య సామాన్యమైన ఆవిడ విజయాలు మనకు నేర్పేది, "ఆత్మ తృప్తే అసలైన ఆస్తి" అని.

**శ్రీమతి సుబ్బలక్ష్మి గారి ఫోను నంబరు: 080-26607556(బెంగుళూరు)**

ప్రత్యేక కథనం : ప్రఖ్య వంశీ కృష్ణ

